7. ఈ క్రింది వాక్యముల ఖాళీలను పూర్తిచేయుడు.

(1) పెద్దన...ఆధిక్యమువలన...లో మోయబడెను.

(2) ...నీతికథలతో...కు, చదువదగి ..న్నది.

(3) కౌరవపాండవులు...లో 18 దినములు...రిరి.

(4) తెలుగుభాష...వలన, తిపిలోని...లన... పేరు...నది.

8. క్రింది పంక్తులను చదివికొని క్రింది ప్రశ్నలను సమాధానించుము.

"మర్కటము మరియు నిట్లనియె. ఓరీ మకరాధమా! నీతో మైత్రికి ఫలితము తోడనె కలిగినది. ఆడుదాని మాటవిని నన్ను చంపదలచితివిగా. ఆడువారు మంచి యెరుగరు చెడ్డ యెరుగరు. దేహములు నీటి బుడగలవంటివి. సంపదలు చంచలములు.

(1) పై వాక్యము లెవరెవరితో ననిరి?

(2) మకరము తలపెట్టిన మోసమేమి?

(3) ఆడువా రెటువంటివారు? ఎందుచేత?

(4) దేహసంపద లెట్టివి?

---

స్కెచ్

# గిరిశంగారి మేనకోడలు

## కాలజ్ఞానం సుబ్బారావు

రైలెక్కట్టుకొని ప్లాటుఫారం చేరుకున్నానో లేదో రైలువచ్చి ఆగింది. ఎక్కబోతూంటే ప్రక్కగా రాచుకొని వడిగా చొచ్చింది లోనికి ఆమె. ఆవైపు నిలుచొనివున్న ఓ ముసలావిడ పాదాలమీద తొందరలో తన స్లిపర్ల నణచడంతో కెవ్వమంది. ఏసానుభూతీ చూపలేదు సరిగదా "దారిలో నుంచొకపోతే నేం? ముసలిపీనుగలు" అని ఆంగ్లంలో అంటూ ఓ చేతిలో వేనిటీబ్యాగ్ మరోచేతిలో కూలింగ్ గ్లాస్ ఊపుకుంటూ ఓ మగవాడిప్రక్కనే బైఠాయించింది ఆ ప్రౌఢ. పాదాలునలిగి సగం జీవం పోయిన ఆ వృద్ధురాలు ప్రక్క స్టాప్‌లో దిగిపోయింది. నేను ఆ ప్రౌఢముందే కూలబడ్డాను పేపరు చదువుకుంటూ. రైలు ఊపువల్ల మగాడి భుజం సోకిందేమో అతగాడిని చురచుర చూచి "ఎనిమల్" అన్నది. ఆ మనిషి సగమయ్యాడే కాని మాట్లాడ లేకపోయాడు.

పేపరు చదువుదామని ఉన్నా, ఆమె వింత ప్రవర్తనవల్ల ఆమెపై ఓకన్నుఉంచాల్సివచ్చింది. కిటికీలోనుంచి బయటికి చూస్తున్న ఆమె వేనిటీ బేగ్ మీది అక్షరాలు అగుపడ్డాయి: "మిస్‌లత. ఎమ్. ఏ." ఆమె వయస్సు పాతికకి తక్కువ ఉండదు. బహుశా "వృద్ధకన్య" అనుకున్నాను. ఆ బాబ్డుహెయిర్, లిప్‌స్టిక్, ఫేస్‌పౌడర్, సిల్కుచీర, జాకెట్ ఫాషన్ మెడలో ముత్యాల హారం (ఇమిటేషన్ అని ఎలా అనుకోవడం?) రిస్ట్‌వాచ్—వేనిటీబ్యాగ్ చూస్తుంటే ఆమె వింత ధోరణికి కారణం తెలిసింది. ఎవరో మహారాజు బిడ్డలా ఉంది. మరోస్టాప్‌లో టికెట్ కలెక్టర్ దాపురించాడు. మావన్నీ చెక్ చేసి ఆమెని గౌరవంగా "టికెట్ ప్లీస్" అన్నాడు. ఒక్కసారి ర్రిమింగేలా చూచి "పాస్" అంది. ఏమి అనకుండా వెళ్ళిపొయ్యాడు అతను. అదే ఓ బీద పిల్లే గనక అయుంటే అతగాని ప్రవర్తన మారి ఉండేది. వేషానికి విలువ లేకపోలేదని విద్యాసాగరు డంతటివాడన్నాడు. పేపర్ మడచాను. "జస్ట్ ఎమినిట్ ప్లీస్" అని చెయ్యి చాచింది మిస్‌లత. ఇవ్వకుంటే బావుండదని యిచ్చాను. ఇక మాస్టాప్ రాబోతుందనగా తిరిగి యిచ్చింది. ఆమెకూడా అక్కడేదిగుతుందని తెలుసుకున్నాను. గేటుదగ్గర ఆమె వెనకే నిలుచున్నా. క్యూలో చాలమంది ఉన్నారు నావెనక. టికెట్ కలెక్టరు చెయి చాపాడు. ఆమె తన్ను కాదన్నట్లు ముందుకు పోబోయింది.

"ప్లీస్ టికెట్" అన్నాడు.

"పాస్" జవాబు.

"షోయిట్ ప్లీస్" ప్రశ్న.

బాగ్‌లోనుంచి ఓ టికెట్ బయటికితీసి "సారీ" అని యిచ్చింది, తెల్లబోయాను.

"ఓ! ఇది ముందు స్టాప్‌వరకేనండి" అన్నాడు టికెట్ కలెక్టర్.

"అలాగా! ఆ స్టుపిడ్ యిక్కడికివ్వమంటే అక్కడికిచ్చాడు. ఎక్స్‌క్యూజ్‌మి నాకు టైమ్ లేదు, పోవాలి"—పోబోయింది మళ్ళీ.

ఆపి అన్నాడు: "ఈ టికెట్ పాతది. తారీఖు కూడా యీ రోజుదికాదు." ఎవరు స్టుపిడో నా కర్థమయింది.

మిస్ లత అందిగదా: "ఛీ—ఎంతమోసం! అవసరంలో గమనించలేకపోయ్యాను." ముందంజ వేసింది.

"ఆగండి. ఎక్సెస్ చెల్లించాలి."

"నోనో! అర్జంట్‌పని అవతలవుంటే... పోవాలి" అని జారిపోవడానికి అడుగు కదిపింది.

ప్రక్కనవుండే పోలీసునుపిలిచి ఆమెకు స్టేషన్ మాష్టర్ దగ్గరికి తీసుకపొమ్మన్నాడు. చెయ్యి పట్టుకున్న పోలీసువాడిని వదిలించుకొని "డామిట్" అంటూ చేసేదిలేక అప్పటికీ గర్వంగా వాడివెంట నడిచింది.

రైల్లోని "వృద్ధురాలు"--ఆ "ఎనిమల్" జ్ఞాపకానికి వచ్చారు.

మేమంతా బయటపడ్డాం. మిస్ లత సాధారణకాదనీ తెగినతీగ అనీ అర్థమయింది. అయినా మనకెందుకని ఊరుకున్నాను. మళ్ళీ ఆ తగాదా ఎలాతీరిందో దేవునికే తెలుసు! గిరీశంగారికి కథ అడ్డంతిరిగినా- మేనకోడలికి మాత్రం కథ అడ్డంగా తిప్పే సామర్థ్యం ఉంది. దేవాంతకురాలు!

సరిగ్గా యీ సంఘటనజరిగిన మూడోనాడు థియేటరులో కూర్చొని ఉన్నాను. ప్రక్కనే ఎవరో మర్యాదస్తుడులా ఉన్నాడు. వేషం డాబుగా లేకున్నా చదువుకున్న వాడల్లేవుంది. కూర్చున్నాడు. ఆట ప్రారంభమయిన క్షణానికి పాపం ఆయన్ని చూపుతూ ఎవరో మహిళ (మహిషంకాదు) గైడ్‌తో అన్నది ఆంగ్లంలో "ఎవరో ఫూల్ నా సీటులో కూర్చున్నాడు." నివ్వెరబోయిన ఆ మనిషి ఆంగ్లంలోనే: "అట్టే వాగాకండి. ఎవరు ఫూలో తెలిసికొని మాట్లాడండి" అని గౌరవంగా సమాధానం యిచ్చాడు. ఆయనకి ఆంగ్లం రాదని ఆమెగారి ఊహ. గైడ్ వాళ్ళని ఆపి బ్యాటరీతో వాళ్లిద్దరి టిక్కెట్లు చూచాడు. ఆయనతో "కోప్పడకండి సార్" అంటూ ఆమెతో "అమ్మగారూ మీది దీని క్రింది క్లాసండి. చీకటిలో దారి తప్పారు" అన్నాడు. "షటప్" అంటూ వాడివెనక అదృశ్యమయింది. చుట్టూ ఉన్న యువకబృందం గొల్లుమంటూ "చార్‌సోబీస్‌రా" (నంబరు 420) అన్నారు. గైడ్ వేసిన బ్యాటరీలైట్‌లో ఆమె మిస్. లత అని గుర్తించిన నా ఆశ్చర్యానికి అంతులేదు.

ఇంతజరిగాక మిస్ లతగారి చరిత్ర తెలిసికోక ఎలాఉండటం? కాస్త స్త్రీలోకానికి దగ్గర పరిచయముగల నా మిత్రుడు కృష్ణమూర్తిని అడిగితే తానువిన్న (కనిన-కాదు) భోగట్టా యిలా చెప్పాడు.

మిస్. లత గొప్పగా చదువుకొని స్త్రీల హక్కులకు పోరాడే ఆదర్శమూర్తి అట. లతకు రాని లలితకళలంటూ. లేవట (అందులో దగా చేయడం మొదటిది కాబోలు!). సిటీలో గ మహిళాసంస్థ లన్నిటికీ తనే అధ్యక్షురాలట. మొన్నమొన్న స్థాపించిన "అన్నపూర్ణ" బ్రాంచి ఆమె కృషిఫలితమేనట. (మనవాడు తప్పక రోజూ హాజరు!) అఖిలభారత మహిళా సమితిలో సభ్యురాలట. గొప్పగొప్ప దేశనాయకులను ఆ సంస్థల తరఫున ఆహ్వానించి ఉపన్యాసాలు దంచేస్తుందట. సత్యం - ధర్మం - వీటికై పోరాడుతుందట.

ఆగకుండా కండ్లుమూసికొని లెక్చరిచ్చే మా వాడి భుజం తట్టి "అయిందా అన్నాను. "పైగా లత లతాంగిరా" అంటూ కనుబొమ్మలు యెగరవేశాడు. వెంటనే "ఆమెకి అంతర్జాతీయ కీర్తి దక్కే అవకాశం దొరకలేదు. మిస్. యూనివర్స్ కని ట్రై చెయ్యాలా?" అన్నాను. "ఏమిటీ?" అన్నాడు. నాకు తెలిసిన మిస్. లతగారి అడ్వెంచర్స్ ఏకరవుబెడితే మావాడి ముఖంలో కత్తివేటుకు నెత్తురుచుక్క లేకుండాపోయింది. "ఇదంతా నేను విన్నదేరా" అంటూ జారుకున్నాడు.